క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు పూజలు

గుంతకల్లుటౌన్: తిరుమల పవిత్రత, ప్రసాదం విశిష్టతను సీఎం చంద్రబాబు అపవిత్రం చేసినందుకు, ఆయన చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం ఉదయం రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పట్టణ, మండలానికి చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు.

తూకాల్లో మోసం చేస్తే చర్యలు



వేయింగ్‌మిషన్ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్

గుంతకల్లు రూరల్: రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేసే సమయంలో మోసం చేసినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ గుంతకల్లు డివిజన్ ఇన్‌స్పెక్టర్ వైజీ శంకర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రేషన్ డీలర్లకు చెందిన వేయింగ్ మిషన్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని డీలర్లందరూ ఈ నెలాఖరులోపు వేయింగ్ మిషన్‌ను వెరిఫికేషన్ చేయించుకుని సీల్ వేయించుకోవాలని సూచించారు

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

యల్లనూరు: బాల్య వివాహాలు ఎక్కడైనా చేస్తుంటే వెంటనే ఆపేయాలని నార్పల ప్రాజెక్టు సీడీపీఓ భారతి సూచించారు. శుక్రవారం యల్లనూరులో బాల్యవివాహాలు, పౌష్టికాహార మాసోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల చాలా నష్టాలు ఎదుర్కొంటారన్నారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజామణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మౌనిక, సమీర

తాడిపత్రిటౌన్: పట్టణంలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులు స్కూల్ ఫెడరేషన్‌గేమ్స్‌లో సత్తాచాటారు. అండర్-17 విభాగంలో అథ్లెటిక్ 1500, 1300 మీటర్ల పరుగు పందెంలో పాఠశాలకు చెందిన మౌనిక, సమీర (9వ తరగతి) జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడాకారులను అభినందించారు.


జావెలిన్ త్రో పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన చందన శ్రీ

బుక్కరాయసముద్రం: మండలంలోని వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చందన శ్రీ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కిష్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో స్కూల్ గేం ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాలకు చెందిన చందనశ్రీ జావెలిన్ త్రో పోటీలలో జిల్లాస్థాయిలో మొదటి స్థానం సంపాదించారు. దీంతో శ్రీకాకుళం జిల్లాలో అక్టోబర్- మొదటి వారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కిష్, పీడీ వరలక్ష్మి పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన శ్రీనివాసులు

యాడికి: మండల కేంద్రంలోని కోట వీధిలో ఓ వ్యక్తి విష రసాయనం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రంలోని కోట వీధికి చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులు(44)కు భార్య శ్రీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా ఆయనకు వెన్ను నొప్పి ఎక్కువగా ఉండటంతో పలు ఆసుపత్రిలకు వెళ్లినా నయం కాలేదు. గురువారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో అతడు ఇంట్లో ఉన్న విష రసాయనం తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆగని ఇసుక దందా

ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకలు దేన్నీ వదిలిపెట్టడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ్ముళ్లు ఇసుకనే ప్రధాన వనరుగా చేసుకున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారులు, పోలీసులు చోద్యం చూస్తుండడంతో అక్రమార్కులు మరింత పేట్రేగిపోతున్నారు.

- పెద్దజలాలపురంలో రెండు టిప్పర్లు, ఒక ఇటాచీ పట్టివేత
- యాడికి, తాడిపత్రి, యల్లనూరులో ఇసుక ట్రాక్టర్ల సీజ్



శింగనమల మండలం పెద్దజలాలపురం వద్ద టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

శింగనమల: శింగనమల మండలంలోని పెద్ద జలాలపురం వంకలో అక్రమంగా టీడీపీ నాయకులు ఇసుకను తరలిస్తుండడంతో గురువారం రాత్రి శింగనమల సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో నార్పల ఎస్‌ఐ సాగర్, గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్, సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడుల్లో రెండు టిప్పర్లు, ఒక ఇటాచీని స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పెద్ద జలాలపురం వద్ద వంకలో నెల రోజులుగా మండలానికి చెందిన నలుగురు టీడీపీ నాయకులు ఇసుకను అక్రమంగా తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. వారిపై పోలీసులు దాడులు జరిపి కేసులు నమోదు చేయడంతోపాటు, టిప్పర్లను సీజ్ చేశారు. బుధవారం రాత్రి పెద్ద జలాలపురం గ్రామానికి చెందిన రైతులు టీడీపీ నాయకులతో భూగర్భజలం తగ్గి పోతుందని వాగ్వాదం చేశారు. దీనితో గురువారం రాత్రి ఆ నాయకులు ఇసుక తరలించలేదు. కానీ మండలంలోని మరి కొంత మంది టీడీపీ కార్యకర్తలు పెద్ద జలాలపురం వద్ద ఇసుక అక్రమంగా తరలించడానికి ఇటాచీ, టిప్పర్లను తీసుకవచ్చారు. దీంతో పెద్ద జలాలపురం రైతులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందితో దాడులు చేసి, ఇటాచీ, రెండు టిప్పర్లను పట్టుకున్నారు. నిందితులపై కేసులను పోలీసులు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. ఇద్దరిపై కేసు

యాడికి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని కంబగిరిస్వామికి చెందిన ట్రాక్టర్‌లో పెన్నానది నుంచి ఇసుక నింపుకుని ఎటువంటి బిల్లులు లేకుండా తాడిపత్రి మండలం గంగాదేవిపల్లెకు చెందిన డ్రైవర్ రామాంజనేయులు యాడికి మండలంలోని తిప్పారెడ్డిపల్లె గ్రామం మీదుగా తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఈ సందర్భంగా ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి ఓనర్ కంబగిరిస్వామి, డ్రైవర్ రామాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. పట్టణంలోని నూతన పెన్నా బ్రిడ్జి వద్ద నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపి పోలీసులు తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతి లేకపోవడంతో డ్రైవర్ కడవల రవీంద్రను అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో మూడు ఇసుక ట్రాక్టర్లు

యల్లనూరు: మండలంలోని శింగవరం సమీపంలో ఉన్న చిత్రావతి నదీ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు, ఇసుక అక్రమ తరలింపులపై ఈ నెల 25న పల్లెల్లో కర్ణాటక కిక్కు శీర్షికన సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టి ఇసుక అక్రమ తరలింపులను నివారించాలంటూ ఎస్‌ఐ రాంప్రసాద్‌ను ఆదేశించారు. దీంతో ఈ నెల 26న రాత్రి రంగంలో దిగిన పోలీసులు శింగవరం సమీపంలో చిత్రావతి నదీపరివాహక ప్రాంతం నుంచి సింహాద్రిపురానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్, గొడ్డుమర్రి వైపుగా తరలిస్తున్న మరో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.



యల్లనూరు మండలంలో పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



గుత్తిలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కేక్ కట్ చేశారు. జెమిని సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుబహాన్, ఉష, గుత్తి కోట గైడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటను అభివృద్ధి పరచండి

అనంతపురం కల్చరల్: గుత్తి కోటను అభివృద్ధి పరచాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి కోరారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా గుత్తి రోడ్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుత్తికోట, కసాపురం కేంద్రాలను పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే గుత్తికి దగ్గరగా ఉన్న వాల్మీకి , బెలూమ్ కేవ్స్‌లను కలుపుతూ బస్సు బాట వేయాలన్నారు. తాడిపత్రి దేవాలయాలు, ఆలూరు కోన, జంబూద్వీప చక్రం, పీఏబీఆర్ వద్ద పార్కుల వద్ద పర్యాటకులకు తగిన వసతులు కల్పిస్తూ హోటళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు కాశీరావు, జ్ఞానేశ్వరరెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒంటికొండ మస్తానయ్య ఉరుసు



చాగల్లులో పూలచాందినిని ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లులో శుక్రవారం తెల్లవారుజామున ఒంటికొండ మస్తానయ్య స్వామి ఉరుసు ఘనంగా నిర్వహించారు. హిందూ ముస్లింలు ఇష్టదైవంగా భావించే మస్తానయ్యకు చాగల్లు గ్రామం నుంచి పూల చాందినీని మేళతాళాలతో ఊరేగింపుగా కొండపై వెలసిన స్వామి చెంతకు తీసుకెళ్లి.. చాందినీని దర్గాలో భక్తులు దర్శనార్థం ఏర్పాటు చేశారు. ఉరుసు సందర్భంగా మండల ప్రజలే గాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ గౌస్‌బాషా పర్యవేక్షించారు. ఏటా భాద్రపద మాసంలో ఉరుసు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదని ఉరుసు

పామిడి: పట్టణంలోని షాదీఖానా ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదని ఉరుసు శుక్రవారం ముగిసింది. జియారత్ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి బయాన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మత పెద్దలు, నిర్వాహకుడు కే రహీమ్, హిందువులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని నంబర్-5 సచివాలయ పరిధిలోని గృహాల యజమానులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సాయిప్రసాద్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం సీఐ సాయిప్రసాద్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యుక్తవయస్సులో నేరాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడంతోపాటు సమాజంపై బాధ్యతగా మెలగాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలు, నిషేధిత చట్టాలు, పోక్సోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎస్‌ఎస్‌ఎస్ పీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పుట్లూరు రోడ్డు సమీపంలో వున్న కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో 'మహిళలపై జరుగుతున్న ఆఘాయిత్యాలు నివారణ చర్యలు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ నారబోయిన శంకర్, ప్రిన్సిపాల్ మునెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

తాడిపత్రి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ రజాక్‌వలి ఆధ్వర్యంలో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీలో ఉన్న ప్రకాశం హైస్కూల్ పోలింగ్ కేంద్రం నంబర్ 218, నందలపాడులోని ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం నంబర్ 270లో 1500 ఓటర్ల కంటే ఎక్కువ మంది ఉన్నారన్నారు. వాటిని విభజించడానికి అవసరమైన సూచనలు ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదలను పంపుతామని ఆయన తెలిపారు.

ఏఐఆర్ఆర్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లు: స్థానిక ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) కార్యాలయంలో ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప తదితరులు వ్యవస్థాపకుడు వైఎస్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై అనేక పోరాటలు చేసి సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆవు ప్రాణాలు కాపాడిన వైద్యుడు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరుకు చెందిన ఓ ఆవుకు సకాలంలో వైద్యం చేసి ప్రాణాలను కాపాడినట్లు శుక్రవారం పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతు వెంకటేష్‌కు చెందిన ఆవు ప్రసవ సమయంలో గర్భాశయం, గర్భం లోపల కాటలిదోస్లు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారింది. రైతు సమాచారం అందించడంతో వెంటనే గ్రామానికి వెళ్లి ఆవు దూడను బయటకు తీసి, బయటకు వచ్చిన గర్భాశయాన్ని, గర్భాశయ భాగాలను లోపలికి నెట్టి కుట్లు వేశామన్నారు. ఆవు, దూడ ఆరోగ్యంగా ఉన్నాయన్నారు.

'ఇంటింటికీ రేషన్ ఇవ్వాలి'

తాడిపత్రి రూరల్: ఎండీఎం వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు సక్రమంగా అందజేయాలని తహసీల్దార్ రజాక్‌వలి సూచించారు. స్థానిక తాహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎండీఎం వాహనాలదారులతో సమావేశమయ్యారు. తాడిపత్రి పట్టణ, మండలంలో 20 వాహనాలు పనిచేస్తున్నాయన్నారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా సరుకులు అందజేయాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెద్దవడుగూరు: మండలంలోని కాసేపల్లి టోల్‌ప్లాజా మీదుగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. గురువారం రాత్రి ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన బొలెరోలో 29 బస్తాల్లో తరిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించి, వాహనాన్ని సీజ్ చేశారు

'పశువులు రోడ్లపైకి వస్తే యజమానులపై చర్యలు'

గుత్తి: పశువులు రోడ్లపైకి వస్తే కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పశువులు రోడ్లపైకి వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పశువుల యజమానులకు కేవలం మూడు రోజులు గడువు ఇస్తున్నామని.. ఆ లోపు పశువులను ఇళ్ల వద్దే కట్టి వేసుకోవాలన్నారు. ఒక వేళ రోడ్డుపైకి పశువులను వదిలితే యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్మికులకు వైద్య శిబిరం

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మున్సిపల్ కార్మికుల కోసం కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్లప్ప, సిబ్బంది వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన



మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ మహాలక్ష్మి

గుత్తి: పట్టణంలోని ఏడీసీసీ బ్యాంకులో శుక్రవారం నగదు రహిత లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మహాలక్ష్మి నగదు రహిత లావాదేవాలు, డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించారు. సైబర్ సెక్యూరిటీ, సైబర్ నేరాలు,సైబర్ ఫ్రాడ్స్‌తో పాటు ఎన్‌పీఎస్ స్కీమ్‌పై వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మధుసూదన్, సిబ్బంది జగదీశ్వరి, కష్టమర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు పనులను గుర్తించాలని ఎంపీడీఓ వీరరాజు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఉపాధి దస్త్రాలను భద్రపర్చుకోవాలన్నారు. సోషల్ ఆడిట్ సమయంలో ఇబ్బందులు పడకుండా ముందస్తుగా దస్త్రాలను సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లూ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న హేమలత

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటరెడ్డిపల్లి, సజ్జలదిన్నె సచివాలయాల్లో శుక్రవారం జిల్లా పబ్లిక్ హెల్త్ టాస్క్‌ఫోర్స్ టీం అధికారిణి హేమలత రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించిన వివిధ కార్యక్రమాల గురించి వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఎంపీహెచ్‌ఈఓలు బాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



చందునాయక్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని గుండాలతండాకు చెందిన రైతు చందునాయక్ (55) శుక్రవారం పొలంలో ఎద్దులను మేపుతూ గుండెపోటుతో మృతిచెందాడు. వివరాలు.. నాలుగు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన ఇటీవల తన పొలంలో ఐదు చోట్ల బోరు వేసినా ఫలితం లేకపోయింది. ఆరోసారి ప్రయత్నించగా నీళ్ల పడ్డాయి. ఆ బోరు కూడా ఏడాదికే ఎండిపోయాయి. దీంతో వ్యవసాయం కోసం చేసిన అప్పు దాదాపు 8 లక్షలకు పెరిగిపోయింది. ఈ ఏడాది సాగు చేసిన కొర్రపంట సరిగా లేకపోవడంతో రెండు రోజుల నుంచి ఆ పంటలో ఎద్దులను మేపుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పొలంలో ఎద్దులు మేపుతుండగా చందునాయక్ గుండెపోటుకు గురై మృతిచెందాడు. సమీపంలోని రైతుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు చందునాయక్ మృతిచెందినట్లుగా నిర్ధారించుకుని మృతదేహాన్ని ఇంటికి తరలించారు. అతడికి భార్య లక్ష్మిబాయి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

యానిమేటర్లను తొలగిస్తే ఆందోళన బాట



వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

శింగనమల: రాజకీయ కక్షతో వెలుగులో పని చేస్తున్న యానిమేటర్లను తొలగిస్తే ఉద్యమిస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం శింగనమల ఆర్టీసీ బస్టాండ్ నుంచి వెలుగు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ నిదనవాడ గ్రామంలో యానిమేటరుగా శివమ్మ 10 సంవత్సరాలు నుంచి పని చేస్తోందన్నారు. కానీ అధికార పార్టీ నాయకులు శివమ్మను తొలగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అలాగే మండలంలో పలువురిని తొలగించి, కొత్తవారిని నియమించాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పని చేస్తున్న వారిని తొలగిస్తే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏపీఓ వీర నారప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్, సీపీఎం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా జాఫర్ సాదిక్



యాడికి: యాడికి సబ్ రిజిస్ట్రార్‌గా జాఫర్ సాదిక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హనుమాన్‌నాయక్ ఉరవకొండకు బదిలీ కాగా, చెన్నేకొత్తపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న జాఫర్ సాధిక్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే గుత్తిలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రమీలమ్మ యాడికికి బబదిలీపై వచ్చారు. నూతన అధికారులకు స్టాంప్ వెండర్లు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

మండల ఇంజినీర్‌గా సురేష్‌రెడ్డి



తాడిపత్రి రూరల్: మండల ఇంజినీర్‌గా సురేష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ విభాగంలో పనిచేస్తున్న ఆయనను తాడిపత్రి మండల ఇంజనీర్‌గా బదిలీ చేశారు.

ట్రాన్స్‌కో ఏఈగా విజయ్‌కుమార్



గార్లదిన్నె: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ అనంతపురం నుంచి బదిలీపై వచ్చానన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు.

ఆర్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఆర్‌ఐ హరిప్రసాద్

గుంతకల్లు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం వై.హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్‌ఐగా పనిచేస్తున్న రాజేష్ విడపనకల్లు మండలానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో యల్లనూరులో ఆర్‌ఐగా పనిచేస్తున్న హరిప్రసాద్‌ను గుంతకల్లుకు బదిలీ చేశారు.

డీటీగా శ్రీనివాసులు

యాడికి: మండల డిప్యూటీతహసీల్దార్‌గా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా విధులు నిర్వహిస్తున్న బాలమ్మ ఆత్మకూరు మండలానికి బదిలీపై వెళ్లారు. తాడిపత్రి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు యాడికి మండలానికి బదిలీపై వచ్చారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

82 మందికి ఉద్యోగాలు

గుంతకల్లుటౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 82 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగానికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రభాకర్, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధులు మహేష్, లోకేష్ తెలిపారు. జాబ్‌మేళాకు 156 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. డిక్సెన్ ప్రో సొల్యూషన్స్, కార్వెవస్‌గ్లోబల్ సొల్యూషన్స్, టెక్ మహీంద్ర, ఎస్‌బీఐ లైఫ్, జోయలుకాస్ కంపెనీల్లో పనిచేయడానికి వారిని ఎంపిక చేశారన్నారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులో నివాసముంటున్న రవికుమార్, రాంబాబు ఇళ్లలో శుక్రవారం పట్టపగలే రెండిళ్లలో చోరీ జరిగింది. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇద్దరూ శుక్రవారం ఉదయం 9 గంటలకు తమ ఇళ్లకు తాళం వేసి విధులకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనానికి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తలుపులు తీసి ఉండడంతో గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. రెండిళ్లలోనూ బీరువాలో ఉన్న రూ. 5 వేలు నగదు, 25 తులాల వెండి ఆభరణాలు, రెండు ఏటీఎం కార్డులు అపహరించుకెళ్లినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో సీఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పాతపల్లిలో నగదు చోరీ

యల్లనూరు: పాతపల్లికి చెందిన లక్ష్మీదేవి ఇంట్లో గురువారం రాత్రి రూ.60 వేలు నగదు చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు. వ్యవసాయ పెట్టుబడులకు తన అల్లుడితో ఆమె రూ.60 వేలు అప్పు తెచ్చుకుని ఇంట్లో బీరువాలో భద్రపర్చింది. పని నిమిత్తం తాడిపత్రిలో కూతురు ఇంటికి వెళ్లింది. రెండు రోజులు ఆమె ఇంట్లో లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు పథకం ప్రకారం చోరీ చేశారు. శుక్రవారం ఉదయం లక్ష్మీదేవి తోడు కోడలు పొలానికి వెళ్తూ.. తలుపుల తాళాలు ధ్వంసం చేసి బీరువాలో చీరలు చెల్లాచెదురుగా ఉండడంతో ఫోన్ ద్వారా లక్ష్మీదేవికి సమాచారమిచ్చారు. ఆమె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం జిల్లా కేంద్రం నుంచి క్లూస్‌టీం హెడ్‌కానిస్టేబుళ్ల తిమ్మరాజు, వెంకయ్య, యల్లనూరు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. ఎస్‌ఐ రాంప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: మట్కా నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి రూ.30,240 నగదు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో మట్కా నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో భగత్‌సింగ్ నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న గజ్జల నరేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని, అతడి నుంచి రూ.30,240 నగదుతో పాటు చీటీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.